క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట : నూతనంగా పట్టాపాస్ పుస్తకం పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ గంగాజమున శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు రైతులు అర్హులని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఎన్నిచోట్ల భూమి ఉన్నప్పటికీ బీమా ఒకటే ఉంటుందని తెలిపారు. రైతులు నేరుగా రైతువేదికకు వెళ్లి నామినేషన్ ఫారంపై సంతకం చేసి పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను ఏఈఓకు అందించాలని సూచించారు. గతంలో రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోని రైతులు కూడా దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: హనుమకొండ పరిధిలోని వికాస్‌నగర్, భవాని జంక్షన్ ప్రాంతాల్లో 500 డీఐ పైపులైన్‌కు లీకేజీ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఆదివారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వకేట్స్ కాలనీ, శ్రీనివాస్ కాలనీ, బాలసముద్రం ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

చెక్కుల పంపిణీ



వరంగల్ చౌరస్తా: వరంగల్ ఎస్‌బీఐ కార్యాలయాన్ని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ జనరల్ మేనేజర్ (నెట్ వర్క్ –2) ప్రకాశ్‌చంద్ర బరోర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన రూ.38.27 లక్షల చెక్కును ఉమామహేశ్వర్ గౌడ్ సతీమణి సంధ్యారాణికి అందచేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు ఘనశ్యామ్, ఏజీఎం రాజేంద్ర కుమార్, ఆర్ఎం విష్ణువర్ధన్, మేనేజర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసైతే జీవితం విచ్ఛిన్నమే

ఖిలా వరంగల్: యువత మద్యానికి బానిసైతే జీవితాలు విచ్ఛినం అవుతాయని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మిల్స్‌కాలనీ పోలీసులు, ఆల్కహాలిక్స్ - ఎనానిమస్ వరంగల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యాన్ని దూరంగా ఉంటూ మంచి జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో యువకులు, ఆల్కహాలిక్స్ ఎనానిమస్ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఉద్యోగుల బదిలీలు ఆపాలి

న్యూశాయంపేట: గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు, కార్మికుల బదిలీలను వెంటనే ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, కార్మికులు దళిత సామాజిక వర్గానికి చెందిన వారని, చాలామంది సఫాయి కార్మికులకు అద్దె ఇళ్లు కూడా ఇవ్వని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిని బదిలీ చేయడం వల్ల వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, లక్ష్మణ్, భిక్షపతి, శంకర్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలపై సదస్సు

వరంగల్ చౌరస్తా: ప్రజల మధ్య చిచ్చుపెట్టే మతోన్మాద విధానాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు వామపక్షాల ఆధ్వర్యంలో వామపక్షాల జిల్లా సదస్సును శివనగర్‌లోని సురేందర్ భవన్‌లో ఈనెల 25న నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఎంసీపీఐ (యూ) ఓంకార్ భవన్‌లో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, న్యూ డెమొక్రసీ నాయకుడు రాచర్ల బాలు రాజు, సీపీఎం (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి హాజరై మాట్లాడారు. సమావేశంలో నాయకులు నర్ర ప్రతాప్, సుంచ జగదీశ్వర్, రాజు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

మామునూరు: వరంగల్ – ఖమ్మం రోడ్డు సత్యసాయినగర్ కాలనీలోని శ్రీపోచమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈమేరకు ఆలయాభివృద్ధికి రూ.60 వేలను లక్కర్స్ రాజేష్‌కుమార్, శైలజ దంపతులు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి శ్రీనివాస్ గుప్తా, రాంబాబుకు విరాళం అందజేసిన దాతలను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, రవిచందర్, కారింగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘అమ్మ మాట’ విని అంగన్‌వాడీకి రావాలి

- ఎంపీడీఓలు గుండె బాబు, శ్రీనివాస్
- చిన్నారులకు అక్షరాభ్యాసం..
- అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలని చిన్నారులకు బుజ్జగింపు
- ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి

కమలాపూర్ : అమ్మ మాట విని చిన్నారులందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలని ఎంపీడీఓ గుండె బాబు చిన్నారులను బుజ్జగించారు. మండలంలోని గూడూరును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మండలంలోని చిన్నారులు, గర్భిణులు సకాలంలో టీకాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం స్వీకరించాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతీరోజు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని, ప్రతీరోజు ఒక ఉపాధ్యాయుడు మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూసి నాణ్యతను పరిశీలించాలన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యార్థులకు విద్యా బోధన అందించాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. దోమల నివారించేందుకు నీరు నిల్వఉన్న ప్రదేశాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని అన్నారు. పంచాయతీ రికార్డులు, పారిశుద్ధ్య పనులు, నర్సరీ నిర్వహణలో ప్రగతి కనిపించకపోవడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాంబయ్య, ఉపాధ్యాయయులు తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీడీఓ బాబు

నడికూడలో..

నడికూడ : అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, నర్సక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ చిర్ర బోయిన శ్రీనివాస్ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. రెండు, మూడు సంవత్సరాలు పూర్తయిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రీ స్కూల్ యాక్టివిటీ నేర్పించడంతో పాటు అనుబంధ పోషకాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నడికూడ : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం అంగన్‌వాడీ టీచర్ షరీఫాబీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్ఎం స్వరూప, ఆశా కార్యకర్త సునీత, తల్లులు పాల్గొన్నారు.



శాయంపేట : హుస్సేన్‌పల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్

వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ గుండాల నాగరాజు

నడికూడ : నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గుండాల నాగరాజు సూచించారు. మండలంలోని కంఠాత్మకూర్ వాగు వరద ఉధృతి, తాత్కాలికంగా నిర్మించిన వంతెనను శనివారం పరిశీలించారు. వాగు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ఎప్పటికప్పుడు చెరువులను, వాగులను పర్యవేక్షించి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్ఐ హేమ నాయక్, ఐబీ డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కంఠాత్మకూర్ తాత్కాలిక వంతనను పరిశీలిస్తున్న తహసీల్దార్ గుండాల నాగరాజు

పంటలు మునుగుతున్నా పట్టించుకోరా?

- గుండేడు రైతులు ఆవేదన

కమలాపూర్ : వరద నీటిలో పంటలు మునిగిపోతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోరా అని మండలంలోని గుండేడుకు చెందిన రైతులు గూడూరి రఘు, రవి, సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో తమ గోడు వెలిబుచ్చారు. గుండేడు నుంచి పంగిడిపల్లి వరకు నూతనంగా రోడ్డు నిర్మిస్తున్నారని తెలిపారు. గుండేడు గ్రామ శివారులో వరద నీరు వెళ్లేందుకు కల్వర్టు నిర్మించాల్సి ఉందని, కాంట్రాక్టర్ అక్కడ కల్వర్టు నిర్మించేందుకు పైపులు వేశాడని, కానీ కొందరు దీనిని రాజకీయం చేసి కల్వర్టు నిర్మాణాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. దీంతో కాంట్రాక్టర్ అక్కడ కల్వర్టు నిర్మించకుండా పైపులు తీసుకెళ్లి రోడ్డు వెంట సుమారు కిలోమీటరు వరకు కాల్వ తవ్వించాడని తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరదనీరు కాల్వ ద్వారా తమ పంట పొలాల్లోకి చేరుతుందని తెలిపారు. పొలాల్లో నాట్లు వేసే పరిస్థితి లేదని, ఒక వేళ నాట్లు వేసినా ఆ పంటలు వరద నీటిలో మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఇప్పటికే రెండు సార్లు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించి తమ పంటలు కాపాడాలని కోరారు.



కాల్వలో ప్రవహిస్తున్న వరదనీటిని చూపుతున్న రైతు

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి



ఉపాధ్యాయులతో విద్యార్థుల తల్లిదండ్రులు

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించి మౌలిక వసతులను కల్పించాలని ఐనవోలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మధుకర్ కోరారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత సంవత్సరం పాఠశాలలో 4, 5 తరగతులు చదివిన 4 గురు విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారని తెలిపారు. విద్యార్థులకు ఉత్తమమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వ పరంగా ఉచిత పుస్తకాలు, వర్క్‌బుక్స్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, రెండు జతల స్కూల్ యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, దాతలు ముందుకు వచ్చి సౌకర్యాల కల్పనకు తోడ్పాటు అందిస్తే ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సారయ్య, లక్ష్మీ, కుమారస్వామి, రాజు, అక్బర్, స్రవంతి పాల్గొన్నారు.

కందులబండ గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలకు కృషి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న గుడిసెవాసులు

కాజీపేట అర్బన్: న్యూశాయంపేటలోని కందుల బండ గుడిసెవాసులకు పట్టాలిప్పించి, పక్కా ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హామీ ఇచ్చారు. 31వ డివిజన్‌లోని సర్వే నంబర్ 579లోని 18 గుంటల భూమిలో నివాసముంటున్న 250మంది గుడిసెవాసులను ఎమ్మెల్సీ నర్సిరెడ్డి శనివారం పరామర్శించి మాట్లాడారు. సీపీఎం కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మూడేళ్లుగా నివాసముటున్న గుడిసెవాసులను ఎమ్మార్పీఎస్ నాయకులు బెదిరిస్తూ కందుల బండ తమదేనని, దౌర్జన్యం చేస్తూ, సీపీఎం జెండా గద్దెను కూల్చివేయడం దారుణమని అన్నారు. కందుల బండ భూమిని సాధించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, చుక్కయ్య, భానునాయక్, నాయకులు ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, మల్లేషం, ఉపేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బండ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వండి

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి న్యూశాయంపేటలోని సర్వే నంబర్ 579లోని కందుల బండను కొట్టిన కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కోరారు. ఈమేరకు బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమకొండ బస్టాండ్ వద్ద వడ్డెర కులస్తులకు ఇచ్చిన విధంగా న్యూశాయంపేట మాదిగ కార్మికులకు సైతం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంద కుమార్, జన్ను దినేష్, సుకుమార్, చేతల శివ, జూపాక వేణు, రాజయ్య, మూర్తి, బాబు, మంద విశాల్, అరుణ్, బన్నీ, ఐనుముల ప్రవీణ్, సంధ్య, సదిరం ప్రభావతి, మంద లక్ష్మి, మంద రజిత, బండ కార్మికులు పాల్గొన్నారు.

సమర్థుడైన నాయకుడితోనే అభివృద్ధి



మాక్ పోలింగ్‌లో డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు

ఖిలా వరంగల్: సమర్థుడైన నాయకుడి ఎన్నికల్లో ఎన్నుకుంటేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఏకశిల డిజీ స్కూల్ డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి తెలిపారు. పీపుల్ లీడర్ ఎన్నిక కార్యక్రమంలో భాగంగా శివనగర్‌లోని ఏకశిల స్కూల్ ప్రాంగణంలో వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్ ఆధ్వర్యంలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించి, సమర్థుడైన నాయకుడి ఎన్నికపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొండల్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకుని మాట్లాడారు.

విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న హనుమకొండలోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన ఏబీఎస్ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థల అధిక ఫీజులను నియంత్రించాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలన్నారు.

మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: మత్స్యకారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మత్స్యకారులకు చెరువులు, కుంటలపై సర్వహక్కులు కల్పించాలని కోరుతూ వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వరంగల్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంగరబోయిన ఉమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. తొలుత పెట్రోల్ బంక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మత్స్యకారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చొప్పరి సోమన్న, రాజ్‌కుమార్, నర్ర ప్రతాప్, బుస్స వెంకన్న, వాసుదేవ్, రాజేష్, బోళ్ల కుమారస్వామి, బొజ్జ కుమారస్వామి, సారంగపాణి, రాజు, రమేష్, మోహన్‌బాబు, బోళ్ల రాజు, లక్ష్మీనారాయణ, సాంబయ్య, భరత్, సూరయ్య, కుమారస్వామి, రాములు, కృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సీసీరోడ్డు నిర్మించాలి



ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలకు వెళ్లే దారి బురదమయంగా మారిందని వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్, ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వర్షాకాలంలో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బురదలో జారిపడి గాయాలపాలవుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందించినవారిలో విద్యార్థుల తల్లిదండ్రులు హింగె భాస్కర్, హింగె రాజు, రమేశ్, గొర్రె శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, మంకని చేరాలు, నరేష్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కమలాపూర్ : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. గంజాయి నిర్మూలన, సైబర్ నేరాలపై మండల కేంద్రంలోని గుడిబండ మార్కెట్ ప్రాంతంలో శనివారం అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిలసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. గంజాయి విక్రయాలు చేసినట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని, అనుమానం వస్తే 1930కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వీరభద్రరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



శాయంపేట : మండల కేంద్రంలోని నాల్గోవార్డులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ వైర్లు కిందకివాలి ఉండడంతో తన ఇంటికి తగులుతున్నాయని సాదు సదానందం తెలిపాడు. ఇటీవల ఎడతెరిపిలేకుండ వర్షాలు కురుస్తుండడంతో భయాందోళన చెందుతున్నామని తెలిపారు. పైపులు కోసి విద్యుత్ వైర్లకు తొడగించడంతో ఇంటి గోడల్లోని బైడింగ్ వైరు విద్యుత్ వైర్లకు తగిలినప్పుడు ఎర్త్ వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని మూడునెలల క్రితం విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

వేలేరు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రుణమాఫీని అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కొయ్యడ మహేందర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లక్ష రూపాయల రుణమాఫీ అందరికీ కాలేదని, కొంతమంది రైతులకు మాత్రమే మాఫీ అయ్యిందని ఆరోపించారు. రుణమాఫీ జాబితాలో కొంతమంది రైతుల పేర్లు మాత్రమే ఉన్నాయని, అధికారులను అడిగినా సమాధానం చెప్పడం లేదని తెలిపారు. అలాగే రైతుభరోసాను ఇంకా అందించలేదని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతుభరోసా విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.

ఆర్థికసాయం అందజేత

వేలేరు : మండల కేంద్రానికి చెందిన మోతె నక్షత్ర అనే చిన్నారి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న భీమ్ యూత్ సభ్యులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు రాజు, సభ్యులు శ్రీకర్, జీవన్, రాజు, రవీందర్, ధనుంజయ్ పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి ఆలయంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అరుట్ల కృష్ణమాచార్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం కాగడ హారతి, 108 కళశాలతో పంచామృత అభిషేకాలు, అర్చనలు, మధ్యాహ్న హారతి, సాయంత్రం 6 గంటలకు ధూపహారతి, భజనలు, పల్లకిసేవ, పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శ్రీసాయి సేవ ట్రస్ట్ వారు అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



హన్మకొండ (పరకాల) : రౌడీషీటర్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడొద్దని పరకాల సీఐ క్రాంతికుమార్ హెచ్చరించారు. పరకాల ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం పోలీసుస్టేషన్‌లో స్థానిక రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం వారు చేస్తున్న పనులపై ఆరా తీశారు. సత్‌ప్రవర్తనతో మెదలాలని, ఏవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు.

వీధి బాలల వసతి గృహంలో వైద్యశిబిరం

వరంగల్: వరంగల్‌లోని డాన్‌బాస్కో వీధి బాలల వసతి గృహంలోని పిల్లలకు శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ట్రస్ట్ సహకారంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి తెలిపారు. డాక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పేద పిల్లలు, అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు రెండు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహం సిబ్బంది సంతోష్, దివ్య, శారద, పిల్లలు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఛేదించకుంటే చర్యలు తప్పవు

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగపద్మజ

కమలాపూర్ : వన మహోత్సవంలో భాగంగా ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి సంరక్షించని పక్షంలో చర్యలు తప్పవని హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగపద్మజ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 25వ తేదీలోగా ప్రతి గ్రామంలో 5 వేల మొక్కలు నాటించాలని, ఐదుగురు రైతులతో పండ్ల తోటలు సాగు చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత, పీఆర్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల వెంట తప్పనిసరిగా మొక్కలు నాటాలని, ఎక్కడ చూసినా పచ్చదనం కనిపించేలా వివిధ రకాల మొక్కలు నాటాలని సూచించారు. డ్రాగన్ ఫ్రూట్స్‌తో రైతులు ధనవంతులవుతారని, ప్రతి గ్రామంలో డ్రాగన్‌ఫ్రూట్స్ తోటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి నిత్యం రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి అన్ని రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ గుండె బాబు, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్డీఓ నాగపద్మజ

రైతు రుణమాఫీ పత్రాల అందజేత



మడికొండ: మొదటి విడతలో రూ.లక్షలోపు రుణమాఫీ అయిన రైతులకు మడికొండ డీసీసీబీ ఆధ్వర్యంలో పత్రాలను శనివారం అందజేశారు. కాజీపేట మండలంలో సుమారుగా 427 మంది రైతులకు రూ.కోటి నలభై లక్షల వరకు రుణమాఫీ జరిగినట్లు బ్యాంక్ అధికారులు వెల్లడించారు. రైతులకు తిరిగి రుణాలు అందించేందుకు గ్రామాల వారీగా క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఏజీఎం శ్రావంతి వివరించారు. కార్యక్రమంలో కాజీపేట దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, బ్యాంక్ మేనేజర్ జీవన్, సూపర్‌వైజర్ రాజేష్, సొసైటీ సెక్రటరీ భూపాల్‌రెడ్డి, రైతులు భిక్షపతి, మహేష్, బత్తిని రవికుమార్, రాజేందర్, శ్రీనివాస్, నవీన పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్. రమేష్ (S.R) : 9441557565 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)